హెచ్‌సీయూ భూములను పరిరక్షించండి

మొదటిపేజీ తరువాయి...

మండిపడ్డారు. ఈ వ్యవహారంపై అడ్మినిస్ట్రేషన్ విభాగం స్పందించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సర్కారుపై సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిన నేపథ్యంలో ఇప్పటికైనా అడ్మినిస్ట్రేషన్ విభాగం విద్యార్థులకు మద్దతుగా నిలవాలని కోరారు. యూనివర్సిటీ భవిష్యత్తు, పర్యావరణ పరిరక్షణ కోసం తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం 2300 ఎకరాల భూములను వర్సిటీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

ఆక్రమణలకు అడ్డుకట్ట వేద్దాం

యూనివర్సిటీ ఏర్పాటు సమయంలో వర్సిటీకి కేటాయించిన భూముల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడం కోసం అడ్మినిస్ట్రేషన్ విభాగం చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఇందుకు భూముల రిజిస్ట్రేషనే పరిష్కారమని తెలిపారు. క్యాంపస్ నుంచి పోలీసులు, బుల్డోజర్లను వెంటనే వెనక్కి పంపించాలని కోరారు. చెట్లు నరికేసిన ప్రాంతంలో పునరుద్ధరణ చర్యలు చేపట్టేలా ప్రభుత్వానికి సూచించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ డిమాండ్లకు అధికారులు సానుకూలంగా స్పందించారని సమావేశం తర్వాత విద్యార్థులు తెలిపారు. కేంద్ర సాధికార కమిటీ నివేదికలో పేర్కొన్నట్టుగానే పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్యం పెంపొందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్టు వెల్లడించారు. హెచ్‌డీఏ అడ్మినిస్ట్రేషన్లకు వర్సిటీ పరిధిలోనే ప్రవేశ పరీక్ష నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించినట్టు తెలిపారు. సీఎస్ఐఆర్‌కు అప్పగించకుండా దీనిపై అన్ని విభాగాల వారు మరోసారి స్పందించాలని కోరినట్లు తెలిపారు.

వచ్చేనెలలోనే పీసీసీ నియామకం!

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తేతెలంగాణ): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నియామకం మే నెలలో ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. హైదరాబాద్‌లో జరుగుతున్న భారత్ సమ్మిట్ నేపథ్యంలో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన పదవుల భర్తీలో అనేక సమీకరణాలు ఉన్నాయని, వాటన్నింటినీ బేరీజు వేసుకొని భర్తీ చేయబోతున్నామని చెప్పారు. క్యాబినెట్ విస్తరణపై చర్చలు జరుగుతున్నాయని, ఈ అంశం ఏఐసీసీ, ముఖ్యమంత్రి పరిధిలో ఉన్నట్టు తెలిపారు. మంత్రివర్గంలో ఆరు ఖాళీలు ఉంటే ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉందని, అందువల్లే జాప్యం జరుగుతున్నట్టు చెప్పారు. కులగణనకు అనుగుణంగానే మంత్రివర్గ విస్తరణ జరగాలని పీసీసీ చీఫ్‌గా ఆశిస్తున్నామని తెలిపారు.

భారత్ సమ్మిట్‌లో గందరగోళం!

- పిలిచినోళ్లు రాలేదు... వచ్చినోళ్లు మాట్లాడలేదు!
- అడుగడుగునా ఆగమాగం, సమన్వయలోపం
- సరైన దిశానిర్దేశంలేదని ప్రతినిధుల అసంతృప్తి
- తెలంగాణ సర్కారు, నిర్వాహకులపై విమర్శలు
- తొలిరోజు గైర్హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రెండోరోజు రాహుల్, ఖర్గే హాజరు అనుమానమే!

హెచ్ఐసీసీలో జరుగుతున్న భారత్ సమ్మిట్-2025లో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్‌నేత దిగ్విజయ్‌సింగ్, ఎంపీ మల్లురవి, విదేశీ ప్రతినిధులు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ హెచ్ఐసీసీలో జరుగుతున్న భారత్ సమ్మిట్-2025లో గందరగోళంగా మారిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం, పలు సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో మొదటిరోజు సర్వత్రా సమన్వయలోపం కనిపించిందని సమ్మిట్‌కు హాజరైన ప్రతినిధులు మండిపడ్డారు. ఆతిథ్యం ఇచ్చిన రాష్ట్రం నుంచే ప్రతినిధులు చర్చలో పాల్గొనకపోవడంపై జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు ఆశ్చర్యంవ్యక్తంచేశారు. కార్యక్రమ నిర్వహణలో సమర్థవంతమైన ప్రణాళిక లేదని తెలిపారు.

గొప్ప సదస్సుగా ప్రచారం.. రేవంత్ డుమ్మా

భారత్ సమ్మిట్-2025కు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని నిర్వాహకులు ప్రకటించారు. కానీ తొలిరోజు వారెవరూ హాజరు కాకపోవడంతో ప్రతినిధులు నిరుత్సాహం వ్యక్తంచేశారు. కనీసం రెండోరోజైనా వారు హాజరవుతారా? లేదా అనే విషయంపై ఎవరూ స్పష్టత ఇవ్వడంలేదని తెలిపారు. హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మకమైన సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్నట్టు ప్రచారం చేసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. అందుకు తగిన ప్రాధాన్యత ఇవ్వడంలేదని విమర్శిస్తున్నారు. సదస్సుకు సీఎం రేవంత్‌రెడ్డి కూడా డుమ్మా కొట్టడమేంటని ప్రశ్నిస్తున్నారు. సదస్సు ద్వారా తెలంగాణకు పెట్టుబడులు రాబట్టేందుకు అవకాశం ఉన్నప్పటికీ రేవంత్ పట్టించుకోవడంలేదని, అలాంటప్పుడు ఇంతఖర్చు పెట్టి సదస్సు నిర్వహించడమెందుకని సదస్సులో సొంతపార్టీ ప్రతినిధులే పెదవి విరిచారు. సమ్మిట్‌కు వచ్చిన మంత్రులు, నేతల మధ్య సమన్వయం కనిపించలేదని అసంతృప్తి వ్యక్తంచేశారు.

ప్యానల్ డిస్కషన్‌లో మనోళ్లెక్కడ?

ప్యానల్ డిస్కషన్‌లలో తెలంగాణ నుంచి ఒక్క ప్రతినిధికి కూడా అవకాశం దక్కలేదు. తమకు ఆసక్తి ఉందని కొందరు చెప్పినా నిర్వాహకులు పట్టించుకోలేదని తెలంగాణ ప్రతినిధులు తెలిపారు. అంతర్జాతీయ వేదికల మీద మాట్లాండేంత నాలెడ్జ్ ఎవరికి ఉంది? ఎవరికి అవకాశం ఇద్దాం? అంటూ ఆరా తీసిన నిర్వాహకులు గురువారం రాత్రి కొందరు ఎంపీలను ఎంపిక చేశారని, వారికి మరుసటి రోజు మాట్లాడాల్సిన టాపిక్ గురించి చెప్పారని తెలుస్తున్నది. అయితే అర్ధరాత్రి సమాచారమిచ్చి, మరుసటి రోజు మాట్లాడాలని చెప్తే ఎలా అంటూ కొందరు ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

కార్మిక స్వేదంతో సమ్మిట్ సోకులు!

మొదటిపేజీ తరువాయి...

అవకాశమే లేని భారత్ సమ్మిట్ సదస్సుకు పారిశ్రామిక పెట్టుబడులను ముడిపెట్టి కార్మిక సంక్షేమ శాఖ నుంచి నిధులు మళ్లించడం నిజమేనా? అంటే కార్మిక శాఖ అధికారుల నుంచి 'అవును' అనే సమాధానమే వినిపిస్తున్నది. కార్మిక సంక్షేమ నిధి నుంచి గత నెలలో రూ.300 కోట్లు డ్రా చేసినట్టు కార్మిక శాఖ అధికారులు చర్చించుకుంటున్నారు. ఇందులోంచి రూ.250 కోట్లను ఫ్యూచర్‌సిటీ అథారిటీ పరిధిలో ఏర్పాటుచేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ అండ్ ఎడ్యుకేషన్ హబ్‌కు వినియోగించినట్టు తెలిసింది. మిగిలిన సొమ్ములో నుంచి రూ.30 కోట్లు భారత్ సమ్మిట్ సదస్సుకు ఖర్చు చేస్తున్నట్టు కార్మిక శాఖ అధికారుల్లో చర్చ జరుగుతున్నది. ఇందుకోసం కార్మిక శాఖలో కాలంచెల్లిన జీవో ఒకదాన్ని వెలికితీసి, దానికి మళ్లీ జీవం పోసి నిధులు డ్రా చేసినట్టు ఆ శాఖలో చర్చించుకుంటున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిగితే అసలు విషయం బయటికి వస్తుందని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఆదినుంచి గోప్యమే..

భారత్ సమ్మిట్ నిర్వహణకు అవసరమయ్యే నిధులను ఎక్కడినుంచి సమకూర్చుతున్నారనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం మొదటినుంచీ గోప్యత పాటిస్తున్నది. మొదట టూరిజం శాఖ నుంచి నిధులు ఖర్చు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. తరువాత సోషల్‌జస్టిస్ నిధులు ఖర్చు చేయబోతున్నట్టు, ఎస్‌డీఎఫ్ నిధులు ఖర్చు చేస్తున్నట్టు ప్రచారం జరిగింది. ప్రస్తుతం కార్మిక శాఖ నిధి నుంచి నిధులు ఖర్చు చేశారనే ప్రచారం జరుగుతున్నది. కానీ, ఇప్పటివరకు ఏ శాఖ నుంచి నిధులు ఖర్చు చేస్తున్నారనేది ప్రభుత్వం బయటికి చెప్పలేదు. నిబంధనల ప్రకారం ఇటువంటి ఈవెంట్ నిర్వాహణ కోసం గ్లోబల్ టెండర్లు పిలవాలి. కానీ, గ్లోబల్ టెండర్లు పిలువకుండానే కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థకు పనులు అప్పగించినట్టు తెలిసింది.

తెలంగాణ ప్రతినిధులకు ప్రాతినిధ్యం ఏదీ?

తెలంగాణను గ్లోబల్ డైలాగ్, ఆవిష్కరణల కేంద్రంగా నిలపడం కోసం భారత్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వం చెప్తున్నది. తెలంగాణ రైజింగ్ విజన్‌ను ప్రదర్శించి, గ్లోబల్ పెట్టుబడులను ప్రోత్సహిస్తామని ప్రకటించింది. కానీ, సమ్మిట్ ప్రతినిధుల గ్రూప్ చర్చలో తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రతినిధుల ప్రాతినిధ్యమే లేకపోవడం గమనార్హం. ప్రతినిధుల ప్రాతినిధ్యం లేకుండా కేవలం పార్టీ నేతలతో రాజకీయ ప్రసంగాలు ఇప్పించినంత మాత్రాన పెట్టుబడులు వస్తాయా? అని పారిశ్రామిక నిపుణులు ప్రశ్నిస్తున్నారు. పెట్టుబడులు, న్యాయం, ప్రపంచశాంతి, అహింస తదితర లక్ష్యాలతో భారత్ సమ్మిట్-2025 శుక్రవారం ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ) నోవాటెల్‌లో రెండు రోజులపాటు ఈ సమ్మిట్ జరుగనున్నది. ఈ అంతర్జాతీయ సదస్సుకు 100కుపైగా దేశాల నుంచి 450 మందికిపైగా ప్రతినిధులు హాజరైనట్టు నిర్వాహకులు చెప్తున్నారు.

వాళ్లు వద్దంటే.. మన సీఎం సరే అన్నారట!

అలీనోద్యమ ప్రతిపాదనకు 70 ఏండ్లు పూర్తి అయిన సందర్భంగా అంతర్జాతీయ సదస్సు ఒకటి నిర్వహించాలని ఏఐసీసీ ప్రతిపాదించింది. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో బెంగళూరు, హైదరాబాద్‌లో ఏదో ఒకచోట పార్టీ పరంగా నిర్వహించాలని ఆలోచన చేసినట్టు తెలిసింది. ప్రస్తుత పరిస్థితుల్లో సదస్సుకు తగిన ఆర్థిక వనరులను సమకూర్చలేమని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ చేతులు ఎత్తేసినట్టు సమాచారం. దీంతో తాము ప్రభుత్వపరంగా తెలంగాణలో నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి నెత్తికి ఎత్తుకున్నట్టు ఆ పార్టీ ఢిల్లీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. తెలంగాణ ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహిస్తున్న సమావేశం కాంగ్రెస్ పార్టీ ఐడియాలజీ సమ్మిట్‌గా మారిపోయిందనే విమర్శలొస్తున్నాయి. ఎన్ఎస్‌యూఐ నేతలకు నిర్వాహణ బాధ్యతలు అప్పగించినట్టు ప్రచారం జరుగుతున్నది. దీంతో వారు కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ తరహాలోనే సదస్సు నిర్వహించారనే ఆరోపణలున్నాయి.

ప్రతినిధుల వివరాలపై స్పష్టత లేదు

వంద దేశాల నుంచి ప్రతినిధులు హాజరైనట్టు రాష్ట్ర ప్రభుత్వం తొలిరోజు ప్రకటించింది. అయితే, ఆ వంద దేశాలు ఏవి? ప్రతినిధులు ఎవరు? అనే అంశం మీద నిర్వాహకులకు కూడా స్పష్టత లేదు. ఇది విదేశాంగ విధానపరమైన కార్యక్రమం కాబట్టి సదస్సుకు సహకారం అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో విదేశాంగ మంత్రిని కలిసి కోరిన విషయం తెలిసిందే. అయితే, దీనిని కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంగా భావిస్తున్న బీజేపీ ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా అర్థిక సహకారం అందించలేదు. తెలంగాణకు చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ వారు కూడా ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు.

ఏమిటీ.. కార్మిక సంక్షేమ నిధి?

రాష్ట్రంలోని ప్రతి భవన, ఇతర నిర్మాణాల అనుమతుల మీద 1% సెస్ వసూలు చేస్తున్నారు. ఈ డబ్బు కార్మిక శాఖ పరిధిలో నడిచే భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఖాతాలో జమ అవుతుంది. దీనినే కార్మిక సంక్షేమ నిధి పేరుతో పిలుస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయేనాటికి రూ.2,500 కోట్ల సంక్షేమ నిధిని కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పగించింది. ఈ డబ్బును కేవలం కార్మిక సంక్షేమానికి మాత్రమే వినియోగించాలి. కార్మిక నిధికి అనుసంధానంగా వివాహ కానుక, ప్రసూతి సహాయం, కార్మికుని సహజ మరణం లేదా ప్రమాదం మరణం సమయాల్లో దహన ఖర్చులు, అంగవైకల్యం పొందితే ఆర్థిక సహాయం, వృత్తిపరమైన శిక్షణ తదితర సంక్షేమ పథకాలు నడుస్తున్నాయి. ఈ పథకాలకు మాత్రమే సంక్షేమ నిధి డబ్బులు ఖర్చు చేయాలి. ఇక్కడ వృతి నైపుణ్య శిక్షణ అనే సాంకేతిక పాయింట్‌ను ఆధారంగా చేసుకొని నిధులను అడ్డదారిలో మళ్లించారని ఆ శాఖ అధికారులు చెప్తున్నారు.

- ఇందిరమ్మ ఇల్లుకు 10 వేలు లంచం అడుగుతున్రు..!

ములుగు జిల్లా వాజేడు మండలానికి వచ్చిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు శుక్రవారం ఓ కాంగ్రెస్ కార్యకర్త గోడు వెల్లబోసుకున్నాడు. ఇందిరమ్మ ఇంటి మంజూరు కోసం కొందరు రూ.10వేలు అడుగుతున్నారని కొప్పుసూరు గ్రామానికి చెందిన కార్యకర్త ముత్యారావు ఫిర్యాదు చేశాడు. అర్హత ఉన్నా తన భార్య జమున పేరు జాబితాలో రాలేదని తెలిపాడు. -వాజేడు

- మా ఇష్టమొచ్చినోళ్లకు ఇచ్చుకుంటం..!

నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలోని అంబేద్కర్‌నగర్‌లో అధికారులు శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితా విడుదల చేశారు. అందులో అనర్హుల పేర్లు ఉండడంతో స్థానికులు అధికారులను నిలదీశారు. ఓ కాంగ్రెస్ నేత స్పందించి 'మాకు ఇష్టం వచ్చిన వారికే ఇండ్లను కేటాయిస్తున్నాం.. ఇది మా ప్రభుత్వం..' అంటూ తెగేసి చెప్పాడు. - మక్తల్

- ఎంపికలో అవకతవకలు... రోడ్డెక్కిన గ్రామస్థులు

'ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అవకతవకలు జరుగుతున్నాయి. ఇందిరమ్మ కమిటీ సభ్యులు డబ్బులిచ్చినోళ్లను.. నచ్చినోళ్లనే ఎంపిక చేస్తున్నరు. అర్హులందరికీ న్యాయం చేయాలి' అని డిమాండ్ చేస్తూ మంచిర్యాల జిల్లా కిష్టంపేట జీపీ పరిధిలోని ఎల్లక్కపేట కాలనీవాసులు రోడ్డెక్కారు. -చెన్నూర్ రూరల్

- ఇండ్లు లేనోళ్లకిస్తరా.. ఇష్టమొచ్చినోళ్లకిస్తరా?

తలదాచుకునేందుకు గూడు లేని తమకు ఇండ్లు ఎందుకు ఇవ్వరని భద్రాద్రి జిల్లా గుర్రాలచెరువు గ్రామస్థులు అధికారులను నిలదీశారు. అర్హుల జాబితాపై అధికారుల విచారణలో మండిపడ్డారు. ఇందిరమ్మ కమిటీల బాధ్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. - అశ్వారావుపేట టౌన్

కాపీ పేస్ట్ నివేదిక!

మొదటిపేజీ తరువాయి...

కుంగుబాటుకు అనేక ఊహాజనిత కారణాలను విశ్లేషిస్తూ నివేదికను విడుదల చేసింది. మళ్లీ ఈ ఏడాది మార్చి వరకు బరాజ్ ఊసెత్తలేదు. అటు తర్వాత ఎట్టకేలకు బరాజ్ కుంగుబాటుకు కారణాలను అధ్యయనం చేసి, పునరుద్ధరణ చర్యలను సిఫారసు చేసేందుకు చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో నిపుణుల కమిటీని నియమించింది. ఆ కమిటీ 2024 మార్చిలో రెండుసార్లు క్షేత్రస్థాయిలో పర్యటించింది. ఇరిగేషన్ అధికారులు, నిర్మాణ ఏజెన్సీల నుంచి వివరాలను సేకరించింది. నిపుణుల కమిటీకి రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా పలు అంశాలను వివరించారు.

రాష్ట్ర ఇరిగేషన్ అధికారులు చేసిన సూచనలు

- అన్ని బరాజ్‌లలో రాఫ్ట్ కిందున్న రంధ్రాలను గుర్తించి, వాటిని పూడ్చాలి.
- బ్లాకుల వారీగా గేట్ల నిర్వహణకు ఆధునిక స్కాడా విధానం అమలు చేయాలి.
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల ఓఅండ్ఎం పనులను ఐఎస్ కోడ్ ప్రకారం చేపట్టేందుకు నిర్మాణసంస్థలకు అవకాశం కల్పించాలి.
- బరాజ్‌ల ఎగువన, దిగువన వాటర్ ఫూప్ కోసం సిమెంట్ గ్రౌటింగ్ చేపట్టాలి. ప్రవాహాలకు ఆటంకంగా మారే రాళ్లను తొలగించాలి.
- మేడిగడ్డలో బ్లాక్ 7లో జామ్ అయిన గేట్లను తొలగించాలి. స్టీల్ షీట్‌పైల్స్‌ను అదనంగా ఏర్పాటు చేయాలి.
- బరాజ్‌లపై వరద ఒత్తిడిన తగ్గించేందుకు ఎగువ భాగంలో నదిపై రెగ్యులేటరీలు నిర్మించాలి.
- బరాజ్‌ల ఎగువ, దిగువన నదీగర్భంలోని ఇసుక మేటలను ఇరిగేషన్‌శాఖ పర్యవేక్షణలో తొలగించాల్సి ఉంటుంది.

మళ్లీ గత నివేదికలోని అంశాలే

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల భద్రతకు సంబంధించి ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ తాజాగా 378పేజీల నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. ఇందులోని సిఫారసులు అన్నీ కూడా గతంలో జారీ మార్గదర్శకాలే కావడం ఇక్కడ గమనార్హం. మేడిగడ్డ బరాజ్‌లోని 85 రేడియల్ గేట్లలో 77 గేట్లు యథావిధిగా పనిచేస్తున్నాయని అనాడే తేల్చిచెప్పింది. తాజాగా కుంగుబాటునకు గురైన 7వ బ్లాక్ మొత్తాన్ని తొలగించాలని వెల్లడించింది. తాజా రిపోర్టులోనూ మళ్లీ అవే అంశాలనే కాస్త వివరణాత్మకంగా, సాంకేతిక పదజాలంతో ఎన్‌డీఎస్ఏ నివేదించిందే తప్ప మరేమీలేదని నిపుణులు చెప్తున్నారు. అదీగాక అండర్‌పైపింగ్ జరగడం వల్లే పిల్లర్ కుంగుబాటుకు గురైందని తాము మొదటి నుంచీ చెప్తున్నామని, అదే విషయాన్ని ఇప్పుడు ఎన్‌డీఎస్ఏ నిర్ధారించిందని వివరిస్తున్నారు. ఎక్కడా స్పష్టమైన కారణాలను వివరించకుండా, సూచనలు చేయకుండా ఊహాజనిత అంశాలతోనే రిపోర్టును వండివార్చిందని ఇరిగేషన్ శాఖ అధికారులు మండిపడుతున్నారు.

ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ తాజా సిఫారసులు

- మేడిగడ్డ, ఇతర బరాజ్‌లలో సమస్యలకు కారణాలను తెలుసుకునేందుకు, నిర్మాణ సమగ్రతను అంచనా వేయడానికి తదుపరి పరిశోధనలు చేయాల్సి ఉంది.
- జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలను నిర్వహించాలి.
- మేడిగడ్డ బరాజ్ మధ్యరేఖ నుంచి 5,000 మీటర్ల దూరం వరకు నది క్రాస్ సెక్షన్లను అధ్యయనం చేయాలి.
- నీటి ప్రవాహ గేజ్‌లను పరిశీలించాలని, జియోఫిజికల్ పరిశోధనల గుణాత్మక ఫలితాలను బోర్‌హోల్ ఇన్వెస్టిగేషన్ల ద్వారా ధ్రువీకరించాలి.
- రుతుపవనాల తర్వాత బరాజ్‌ల అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్‌లోని సెకెంట్ ఫైల్స్, కటాఫ్‌ల పారామెట్రిక్ జాయింట్ల సమగ్రత/కొనసాగింపును అంచనా వేసేందుకు భౌగోళిక పరిశోధనలు నిర్వహించాలి.
- బరాజ్‌ల పునాది పటిష్ఠతను అంచనా వేయాలి. పగుళ్ల పరీక్షలను నిర్వహించి విశ్లేషించాలి.
- ఐఎస్ కోడ్ 13578 నిబంధనల ప్రకారం ఉపరితల పరిశోధనలు నిర్వహించాలి. ఆయా పరిశోధనలు/పరీక్షలన్నింటినీ సీఎస్ఎంఆర్ఎస్, సీడబ్ల్యూపీఆర్ఎస్, ఎన్‌జీఆర్ఐ హైదరాబాద్, ఐఐటీ వంటి సంస్థలతో చేయించాలి.

ఆధారాల్లేకుండానే ఆరోపణలు

అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై ఎలాంటి ఆధారాలు లేకుండానే ఎన్‌డీఎస్ఏ నిపుణులు కమిటీ పలు ఆరోపణలు చేసిందని రాష్ట్ర ఇంజినీర్లు విమర్శిస్తున్నారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల లొకేషన్‌ను మార్చారని, ఎలాంటి ఇన్వెస్టిగేషన్ చేయలేదని తెలపడం సరికాదని వివరిస్తున్నారు. బ్యారేజీల నిర్మాణ స్థలం మార్చిన మాట వాస్తవమేనని, అలాంటి మార్పులు కొత్తదేమీ కాదని, రకరకాల కారణాల వల్ల నిర్మాణ స్థలాన్ని మార్చే పరిస్థితులు ఏర్పడడం సహజమని ఇంజినీర్లు చెప్తున్నారు. స్థలం మార్చినా కూడా భూభౌతిక పరిశోధనలు లేకుండా బరాజ్‌లను నిర్మించారనేది పూర్తిగా అవాస్తవమని ఇంజినీర్లు కొట్టిపడేస్తున్నారు. భూభౌతిక పరిశోధనలు చేసి వాటి ఫలితాలను సీడీవోకి పంపించారని, డిజైన్లను తీసుకున్నారని నొక్కిచెబుతున్నారు. ఆ డిజైన్లను కూడా 'డిజైన్ ఆఫ్ బరాజ్ ఆన్ పర్మియబుల్ ఫౌండేషన్'పై సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సీబీఐపీ), సీడబ్ల్యూసీ జారీ చేసిన డిజైన్ మాన్యువల్‌లు, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) జారీ చేసిన కోడ్స్‌ను తూచా తప్పకుండా పాటించి, డిజైన్లను రూపొందించారని వివరిస్తున్నారు. దేశంలో ఎవరైనా వాటి ఆధారంగానే బరాజ్‌ల డిజైన్లు రూపొందిస్తారని, మరి భూభౌతిక పరిశోధనలు జరపలేదని ఏ ఆధారాలతో ఎన్‌డీఎస్ఏ తెలిపిందో అర్థంకానీ విషయమని, ఇది తెలంగాణ ఇంజినీర్ల ఇంజినీరింగ్ పరిజ్ఞానం, సమగ్రతను అపహాస్యాం చేయడమేనని రాష్ట్ర అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బరాజ్‌ల నిర్మాణానికి ముందు తెలంగాణ ఇంజినీరింగ్ రీసర్చ్ ల్యాబొరేటరీస్ (టీఎస్ఈఆర్ఎల్) ద్వారా మోడల్ స్టడీస్ చేయించలేదని, ల్యాబ్స్‌లో అధ్యయనాలను చేసేందుకు వసతులు లేవనడం కూడా నిరాధారమైన ఆరోపణనేనని వివరించారు. నిజాం జమానాలో స్థాపించిన ఆ ల్యాబ్‌లో అన్ని వసతులు, పరికరాలు ఉన్నాయని, 3 బరాజ్‌లపై 2డీ మోడల్ స్టడీస్ నిర్వహించారని వాటి ఫలితాల ఆధారంగా బరాజ్‌ల వెంట్‌వే పెంచడమేగాక, నిర్మాణాన్ని పర్యవేక్షించారని ఇంజినీర్లు వివరిస్తున్నారు. సూచనలు ఏమీ చేయకుండా ఆరోపణలు చేస్తూ, అసంబద్ధమైన అంశాలతో ఎన్‌డీఎస్ఏ నివేదిక ఇచ్చిందే తప్ప మరేమీ కొత్తదనం లేదని మండిపడుతున్నారు.

విలువైన సమయం వృథా

ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ నివేదికపై రాష్ట్ర ఇరిగేషన్ అధికారులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఆ మాత్రం రిపోర్ట్ ఇవ్వడానికి ఏడాదిన్నర తీసుకోవాల్సిన అవసరంలేదని చెప్తున్నారు. తాము సూచించిన రక్షణ చర్యలనే ఎన్‌డీఎస్ఏ తిరిగి తమకు పంపించిందని, అంతకుముంచి ఏమీలేదని మండిపడుతున్నారు. ఈ మాత్రందానికి విలువైన సమయాన్ని వృథా చేసిందని ఇంజినీర్లు విమర్శిస్తున్నారు. మేడిగడ్డ 7బ్లాక్ తరహాలోనే మిగతా బ్లాకుల్లో కూడా నిర్మాణ లోపాలు, సొరంగాలు, కటాఫ్ వాల్స్‌లో రంధ్రాలు ఉండవచ్చు..? అంటూ ఊహగానాలు చేయడమేకాగా, బరాజ్ మొత్తానికి ఇన్వెస్టిగేషన్ చేయాలని సూచించడం హాస్యాస్పదని వివరిస్తున్నారు. గతంలో పరీక్షలను నిర్వహించిన సమయంలోనే మిగతా బ్లాకుల్లో ఎలాంటి సమస్యాలేదని తేలిపోయిందని ఇంజినీర్లు గుర్తుచేస్తున్నారు. 2024లో వరదలు కూడా సాక్ష్యమని ఉదహరిస్తున్నారు. 15 లక్షల క్యూసెక్కుల వరదను బరాజ్‌లు సురక్షితంగా ఎటువంటి అదనపు డ్యామేజీలు లేకుండా కిందకు పంపించాయని, ఎన్‌డీఎస్ఏ ఊహలే నిజమైతే, ప్రమాదాలు సంభవించి ఉండేవని, కానీ అలాంటివేమీ జరగలేదని చెప్తున్నారు. ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకు 3 బరాజ్‌లలోని అన్ని బ్లాకుల్లో జీయోలాజికల్, జియోఫిజికల్ ఇన్వెస్టిగేషన్ చేసి వాటి ఫలితాల ఆధారంగా పునర్నిర్మాణ డిజైన్లు రూపొందిచుకోవాలంటే కనీసం మూడు, నాలుగు పంటకాలాలు నష్టపోయినట్టేనని వివరిస్తున్నారు. జూన్ రెండో వారానికల్లా గోదావరిలో ప్రవాహాలు పెరుగుతాయని, నవంబర్ వరకు కొనసాగుతాయి కాబట్టి 2025లో పరీక్షల నిర్వహణ అసాధ్యమని, 2026 జనవరిలో మాత్రమే పరిశోధనలు ప్రారంభించాల్సి ఉంటుందని వివరిస్తున్నారు. మొత్తం బ్యారేజీ అంతా పరిశోధించాలంటే మరింత సమయం పడుతుందని తెలిపారు. ఎన్‌డీఎస్ఏ విలువైన సమయాన్ని వృథా చేసిందని ఇరిగేషన్ అధికారులు విమర్శిస్తున్నారు.

లోకం పోకడ

తూప్రాన్ ఆటోడ్రైవర్ కన్నుమూత

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): వారం రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం చేసిన మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన ఆటోడ్రైవర్ గజ్జల బాబు శుక్రవారం చనిపోయాడు. ఈ నెల 19న రాత్రి ఆటోలోనే గడ్డి మందు తాగిన బాబును కుటుంబ సభ్యులు, స్థానికులు సికింద్రాబాద్ గాంధీ దవాఖానకు తరలించారు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడిన బాబు శుక్రవారం తుదిశ్వాస విడిచాడు. బాబుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలంగా ఉపాధి లేక అవస్థలుపడ్డ బాబు తీవ్రమనస్తాపంతో దిక్కుతోచక తనువు చాలించాడని కుటుంబ సభ్యులు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాదిన్న పాలనలో 102 మంది ఆట